సాక్షి
నిజామాబాద్

శనివారం । 8 । ఏప్రిల్ । 2023



పంట నష్టంపై కాకిలెక్కలు

జిల్లాలో పంటనష్టం రిపోర్టులను అధికారులు ఇష్టారాజ్యంగా తయారు చేశారని జోరుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- 12లో ▸



కేసీఆర్‌ను ఎదుర్కొనలేకనే..

సీఎం కేసీఆర్‌ను ఎదుర్కోలేక బీజేపీ నాయకులు ప్రశ్నాపత్రాలు లీక్ చేసి ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని స్పీకర్ పోచారం పేర్కొన్నారు.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం
39.6 /27.3

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఈదురు గాలులు వీస్తాయి. మధ్యాహ్నం ఎండతీవ్రత పెరగవచ్చు. సాయంత్రం వాతావరణం చల్లబడుతుంది.



న్యూస్‌రీల్

జిల్లాకు వర్షసూచన లేదు!

- రెండ్రోజులు ఆకాశం మేఘావృతం

సుభాష్‌నగర్ : జిల్లావ్యాప్తంగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో రానున్న రెండ్రోజులు ఆకాశం మేఘావృతమై ఉంటుందని, జిల్లాకు ఎలాంటి వర్ష సూచన లేదని వాతావరణశాఖ అధికారులు పేర్కొంటున్నారు. రాష్ట్రంలో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన వడగండ్ల వర్షాలు ఉన్నాయని అధికారులు ప్రకటించడంతో రైతాంగం అప్రమత్తమైంది. జిల్లావ్యాప్తంగా పసుపు సహా మొక్కజొన్న, నువ్వు, ఆరుతడి పంటలతోపాటు వరి ధాన్యం చేతికొచ్చింది. ఈ క్రమంలో వర్షాలు కురవడం, ఆకాశం మేఘావృతం కావడంతో అన్నదాతలు టార్పాలిన్లు, ఇతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా పంటలను కాపాడుకుంటున్నారు. కాగా ఇదే అదనుగా భావించిన వ్యాపారులు పంట ఉత్పత్తుల ధరలను తగ్గిస్తున్నారు. రెండ్రోజులుగా పసుపు సహా మొక్కజొన్న, ఇతర పంటల ధరలు పడిపోయాయి.

కేంద్ర కోఆపరేటివ్ కన్సల్టివ్ కమిటీ సభ్యుడిగా ఎంపీ అర్వింద్



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : కేంద్ర ప్రభుత్వ సహకార శాఖ ఆధ్వర్యంలోని కన్సల్టివ్ కమిటీ సభ్యుడిగా ఎంపీ ధర్మపురి అర్వింద్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ శుక్రవారం ఉత్తర్వు లు జారీ చేసింది. వ్యవసాయ, అనుబంధ ఫ్యాక్టరీలు, సహకార సంఘాలకు సంబంధించి మోదీ ప్రభుత్వం ఈ శాఖను కేంద్ర స్థాయిలో కొత్తగా ఏర్పాటు చేసింది. ఈ శాఖ ఆధ్వర్యంలో తాజా కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి చైర్మన్‌గా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వ్యవహరిస్తున్నారు. సహకార శాఖకు ఈ కమిటీ సలహాలు, సూచనలిస్తుంది. ఈ కమిటీలో సభ్యుడిగా ఎంపీ అర్వింద్‌కు స్థానం దక్కింది. అర్వింద్ నియామకంపై బీజేపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

ఆర్టీసీ అధికారులపై ఈడీ బృందం ఆగ్రహం



ఖలీల్‌వాడి : నిజామాబాద్ ఆర్టీసీ అధికారులపై హైదరాబాద్ నుంచి వచ్చిన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల బృందం ఆగ్రహం వ్యక్తం చేసింది. శుక్రవారం హైదరాబాద్ నుంచి వచ్చిన ముగ్గురు ఆర్టీసీ ఈడీ సభ్యుల బృందం ఉమ్మడి నిజామాబాద్ పరిధిలోని ఆరు డిపోల్లో పర్యటించింది. ఆర్టీసీ 100 రోజుల ప్లాన్‌లో భాగంగా నిజామాబాద్ వెనకబడి ఉండడంతో వారు అధికారులతో ప్రత్యేకంగా సమావేశమై మాట్లాడారు. డిపో పరిధిలో బస్సులు అన్నీ తిప్పినప్పటికీ ఎందుకు లాభాలు రావట్లేదని ప్రశ్నించారు. ఆదాయం వచ్చే మార్గాల్లోనే ఎక్కువగా బస్సులు తిప్పాలన్నారు. కరీంనగర్ రీజియన్‌కు చెందిన ఈడీ వెంకటేశ్వర్లు బస్టాండ్‌లో దుకాణాలు, బస్టాండ్ ప్రాంతాలను పరిశీలించారు. బస్టాండ్‌ను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎం ఉషాదేవి, డిపో-1 మేనేజర్ ఆనంద్ తదితరులు ఉన్నారు.

మంచి అలవాట్లతో ఆరోగ్యం



నిజామాబాద్ సిటీ: మంచి అలవాట్లతోనే సంపూర్ణ ఆరోగ్యం కలిగి ఉంటారని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుదర్శనం అన్నారు. శుక్రవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో స్థానిక గౌతంనగర్ పీహెచ్‌సీలో ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ నుంచి ర్యాలీని డీఎంహెచ్‌వో జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు.కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో అంజన, ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ తుకారం రాథోడ్, వెంకటేష్, వైద్యాధికారులు సుసేన, జాహ్నవి, జిల్లా ఆరోగ్య విద్యా బోధకులు ఘన్పూర్ వెంకటేశ్వర్లు, శశికళ, మురళి తదితరులున్నారు.



■ కమ్మర్‌పల్లికి చెందిన జోగు గంగాధర్ ఏడాది కింద రూ.1.25 కోట్లతో తన టీవీఎస్ షోరూం కోసం భవనం నిర్మించాడు. ఇందులోనే ఒక అంతస్తులో బంక్వెట్ హాల్‌ను ఏర్పాటు చేస్తున్నాడు. పై అంతస్తులో నివాసం కోసం గదులు నిర్మించుకున్నాడు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ఇతని భవనం సగం వరకు తొలిగిపోనుంది. పరిహారం రూ.10 లక్షలకు మించి అందే పరిస్థితి లేదు. భవనంలో సగ భాగం తొలగిస్తే రూపు రేఖలు మారిపోవడమే కాకుండా వ్యాపారం దెబ్బతింటుంది. ఇతని కుటుంబం రోడ్డున పడే పరిస్థితి ఏర్పడింది. ఇది ఒక్క జోగు గంగాధర్‌కు జరుగనున్న నష్టమే కాదు. ఎన్నో కుటుంబాల కలలను రోడ్డు విస్తరణ ధ్వంసం చేయనుంది.



- త్వరలో 63వ నంబర్ జాతీయ రహదారి విస్తరణ
- ఇరువైపులా 75 ఫీట్లలోపు భవనాల తొలగింపు
- భూ సేకరణకు నోటిఫికేషన్ విడుదల
- మోర్తాడ్, లక్కోరా, కమ్మర్‌పల్లి, అంక్సాపూర్ వాసుల్లో ఆందోళన
- బైపాస్ రోడ్డు నిర్మించాలని డిమాండ్

ఈ భవనాలకు ముప్పు!

మోర్తాడ్ (బాల్కొండ) : 63వ నంబర్ జాతీయ రహదారి విస్తరణతో జిల్లాలోని పలు గ్రామాల్లో భవనాలకు భారీగా ముప్పు వాటిల్లనుంది. ప్రధానంగా ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాలోని కోటార్మూర్, పెర్కిట్, లక్కోరా, పడిగెల్, అంక్సాపూర్, దొన్కల్, మోర్తాడ్, కమ్మర్‌పల్లిలోని భవనాలు అనేకం పాక్షికంగా తొలగిపోనున్నాయి. ఈ ప్రాంతంలో బైపాస్ రోడ్డు నిర్మాణం ప్రతిపాదన లేకపోవడంతో నష్టం తప్పడం లేదు. జాతీయ రహదారుల అథారిటీ అధికారులు ఇదివరకే బైపాస్ రోడ్డు ప్రతిపాదన ఏదీ లేదని తేల్చిచెప్పారు. కాగా జగిత్యాల్ జిల్లాలోని మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల్ పట్టణాల్లో నివాస గృహాలు, వ్యాపార సముదాయాలకు ముప్పు వాటిల్లకుండా ఉండటానికి బైపాస్ రోడ్డును నిర్మించనున్నారు. జాతీయ రహదారి 63 బోధన్ నుంచి మహారాష్ట్రలోని జగదల్‌పూర్ వరకు విస్తరించి ఉంది. అధికార వర్గాల సమాచారం ప్రకారం పెర్కిట్ నుంచి జిల్లా సరిహద్దు వరకు 26 కిలోమీటర్ల పొడవునా రోడ్డును విస్తరించడానికి నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ రహదారికి సంబంధించిన నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) కార్యాలయాన్ని మంచిర్యాల్‌లో ఏర్పాటు చేశారు. ఇప్పటికే భూ సేకరణ కోసం ఆర్మూర్ ఆర్‌డీవో కార్యాలయం నోటిఫికేషన్‌ను జారీ చేసింది. కొన్ని చోట్ల వ్యవసాయ భూములకే నష్టం వాటిల్లనుండగా ఎక్కువ ప్రాంతాల్లో భవనాలకు భారీ నష్టం ఏర్పడనుంది. పాత రికార్డుల ప్రకారం భూ సేకరణకు అధికారులు నోటిఫికేషన్ ప్రకటించారు. ఇండ్లకు ముప్పు ఎక్కువగా లేదని, వ్యవసాయ భూములకే నష్టం వాటిల్లనుందని అధికారులు పేర్కొన్నారు. అయితే కొత్త రికార్డుల ప్రకారం క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే అనేక అధునాతన భవనాలు ప్రస్తుతం వెలిశాయి. పాతరికార్డుల ప్రకారం భూ సేకరణకు నోటిఫికేషన్ ఇవ్వడంతో కొత్తగా వెలిసిన భవనాలకు జరిగే నష్టం బహిర్గతం కావడం లేదు. మరోవైపు పరిహారం చెల్లింపుపై అధికారుల నిర్ణయం ఎలా ఉండబోతుందోననే సందేహం వ్యక్తమవుతోంది.

రోడ్డున పడనున్న వ్యాపారులు..



ఎన్‌హెచ్‌ఏఐ పీడీకి వినతి పత్రం అందిస్తున్న బాధితులు

జాతీయ రహదారి విస్తరణ వల్ల వాణిజ్య సముదాయాలకు ఎక్కువ నష్టం వాటిల్లనుండటం, కొన్ని చోట్ల ఫ్లైఓవర్ వంతెన నిర్మించే ప్రతిపాదన ఉండటంతో వ్యాపారులు అనేక మంది రోడ్డున పడే ప్రమాదం నెలకొంది. తాము రోడ్డున పడితే తమ భవిష్యత్ అంధకారమే అని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. వ్యాపారుల ప్రయోజనాలను కూడా దృష్టిలో ఉంచుకుని ఎవరికీ నష్టం వాటిల్లకుండా జాతీయ రహదారి విస్తరణకు ప్రత్యామ్నాయ మార్గం చూడాలని పలువురు కోరుతున్నారు.

పాత భవనాలు సేఫ్..

నాలుగు దశాబ్దాల క్రితం అంక్సాపూర్, లక్కోరా, కమ్మర్‌పల్లిలలో నిర్మించిన ఇండ్లు జాతీయ రహదారి నుంచి 75 ఫీట్ల దూరంలో ఉన్నాయి. తాజాగా నిర్మించిన ఇండ్లు మాత్రం 50 ఫీట్ల నుంచి 60 ఫీట్ల దూరంలోనే ఉన్నాయి. ఇప్పుడు ఉన్న జాతీయ రహదారి మధ్య నుంచి 75 ఫీట్ల వరకు రోడ్డును ఇరువైపులా విస్తరించనున్నారు. పాత భవనాలకు అప్పట్లో అనుమతులు 75 ఫీట్ల దూరం ఇవ్వడంతో అప్పటి నిర్మాణాలకు ఎలాంటి ముప్పు వాటిల్లడం లేదు. 75 ఫీట్లకు తక్కువ దూరంలో ఇచ్చిన అనుమతులతో నిర్మించిన భవనాలు అన్ని భూసేకరణలో నేలమట్టం అయ్యే అవకాశాలున్నాయి. ఇదిలా ఉండగా కమ్మర్‌పల్లిలో ఇండ్లకు ఎక్కువ నష్టం వాటిల్లనుండటంతో బైపాస్ రోడ్డును నిర్మించాలని స్థానికులు కొందరు మంచిర్యాల్‌లోని ఎన్‌హెచ్‌ఏఐ పీడీ రవీందర్‌ను కలిసి వినతి పత్రం అందించారు.




రోడ్డు విస్తరణతో కమ్మర్‌పల్లిలో నష్టపోనున్న భవనాలు

బైపాస్ రోడ్డు వేయాలి..



కమ్మర్‌పల్లిలో భవనాలకు భారీగా నష్టం వాటిల్లుతుంది. అందువల్ల జగిత్యాల్ జిల్లాలో మాదిరిగా ఇక్కడ కూడా బైపాస్ రోడ్డును నిర్మించాలి. భవనాలు నష్టపోకుండా ప్రత్యామ్నాయ మార్గం చూడాలి.

– లుక్క గంగాధర్, కమ్మర్‌పల్లి

నష్ట నివారణ చర్యలు చేపట్టాలి..



జాతీయ రహదారి విస్తరణ వల్ల ఏర్పడే నష్టాన్ని తప్పించడానికి అధికారులు చొరవ చూపాలి. లక్షల్లో వెచ్చించి నిర్మాణాలు చేపట్టాం. ప్రభుత్వం ఇచ్చే పరిహారం ఎంతైనా సరిపోదు. భవనాలకు నష్టం జరుగకుండా చూడాలి.

– చిటికేసి రఘు, కమ్మర్‌పల్లి

ముదిరిన వైరం..!

- బీజేపీ, బీఆర్‌ఎస్ మధ్య క్షేత్రస్థాయిలో ప్రతిఘటనలు
- బండి సంజయ్ అరెస్టు నేపథ్యంలో జిల్లాలో వేడెక్కిన వాతావరణం
- మంత్రి ప్రశాంత్‌రెడ్డి వ్యాఖ్యలపై ఠాణాలో మల్లికార్జున్‌రెడ్డి ఫిర్యాదు
- మరోవైపు సభాపతి పోచారం సైతం ఘాటు వ్యాఖ్యలు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : శాసనసభ సాధారణ ఎన్నికల ఏడాది కావడంతో రోజురోజుకూ జిల్లాలో రాజకీయ వాతావరణం గరంగరంగా మారుతోంది. మూడు ప్రధాన పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పోటాపోటీగా ముందుకెళుతున్నాయి. ఈ క్రమంలో బీఆర్‌ఎస్, బీజేపీల మధ్య ప్రత్యక్ష పోరే అనే స్థాయికి వైరం రోజురోజుకూ ముదురుతోంది. ఇప్పటికే నిజామాబాద్ ఎంపీ అర్వింద్, బీఆర్‌ఎస్ నాయకుల మధ్య మాటల యుద్ధంతో పాటు పలుసార్లు ఇరుపార్టీల శ్రేణుల మధ్య ఘర్షణ ఘటనలు చోటుచేసుకున్నాయి. తాజాగా బండి సంజయ్ అరెస్టు నేపథ్యంలో జిల్లాలో సైతం వాడివేడి వాతావరణం నెలకొంది. సంజయ్‌కు బెయిలు వచ్చిన నేపథ్యంలో ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ అక్రమ అరెస్టు చేసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ఇది చెంపపెట్టు అన్నారు. అక్రమ కేసులతో బీజేపీని అడ్డుకోలేరన్నారు. పేపర్ లీకేజీ, విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలపై పోరాటం ఆపేది లేదన్నారు. తాజాగా శుక్రవారం మంత్రి ప్రశాంత్‌రెడ్డిపై బీజేపీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి ఏర్గట్ల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మంత్రి ఉన్నత పదవిలో ఉండి భౌతిక దాడులకు బీఆర్‌ఎస్ కార్యకర్తలను ప్రోత్సహిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రతిపక్షాలు సమస్యలను ప్రస్తావిస్తే భౌతిక దాడులు చేయాలని మంత్రి ప్రోత్సహించడమేమిటన్నారు.

కుట్రలు చేస్తున్నారు..

రుద్రూర్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి బీజేపీ, కేంద్ర ప్రభుత్వంపై ఘాటు విమర్శలు చేశారు. రాజకీయంగా, ప్రజా సంక్షేమం విషయంలో కేసీఆర్‌ను ఎదుర్కోలేక తెలంగాణ ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే కుట్రలు చేస్తున్నారన్నారు. టెన్త్ పరీక్ష పేపర్ లీకేజీకి సంజయ్ బ్రోకర్‌ను ప్రోత్సహించారన్నారు. లక్షల మంది విద్యార్థుల జీవితాలతో చెలగాట మాడుతున్నారన్నారు. కాళ్లల్లో కట్టెలు పెట్టేలా వ్యవహరిస్తున్నారన్నారు. తెలంగాణలో ప్రతి గ్రామంలో బీజేపీ వాళ్లు పదిమంది ఉంటే బీఆర్‌ఎస్ కార్యకర్తలు వందమంది ఉన్నారన్నారు. టీఎస్‌పీఎస్సీ విషయంలోనూ బండి సంజయ్ ఇలాగే చేశారన్నారు. వీళ్లకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు.

దారి మూసేశారు..



నగర శివారులోని మాధవనగర్ రైల్వేగేట్ రోడ్డును శుక్రవారం నుంచి అధికారులు మూసివేశారు. ఇటువైపు వాహనాలు రాకుండా బోర్గాం వద్ద బారికేడ్లు పెట్టి ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. మైక్ ద్వారా అనౌన్స్‌మెంట్ చేశారు. సాయిబాబా గుడి వద్ద రోడ్డుపై మట్టికుప్పలు పోశారు. హైదరాబాద్ వెళ్లే వారు మోపాల్, కంజర, ముల్లంగి, డిచ్‌పల్లి మీదుగా వెళ్లాలని లేకుంటే కంఠేశ్వర్ బైపాస్ నుంచి వెళ్లాలని సూచిక బోర్డులో పేర్కొన్నారు. మాధవనగర్ వైపు వెళ్తున్న వాహనాలను వెనక్కి పంపిస్తున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

యాసంగి బెంగ తీరేనా?

- శ్రీరాంసాగర్ నుంచి ఈ నెల 10 వరకు నీటి విడుదల
- మరింత కాలం నీళ్లివ్వాలని రైతుల డిమాండ్



బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి యాసంగి సీజన్‌కు కాలువల ద్వారా నీటి విడుదలను ఈనెల 10 వరకు ప్రాజెక్ట్ అధికారులు పొడిగించారు. ప్రాజెక్ట్ నుంచి ప్రస్తుత ఏడాది యాసంగి సీజన్‌కు శుక్రవారంతో ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం నీటి విడుదలను నిలిపేస్తున్నట్లు ప్రకటించారు. కాని ఆయకట్టు రైతులు పంటలు గట్టెక్కలేవని అధికారులకు, పాలకులకు విన్నవించడంతో ఈనెల 10 వరకు పొడిగించారు. దీంతో కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతుంది.

15 వరకు ఇవ్వాలని..

కాలువల ద్వారా ప్రస్తుత యాసంగి సీజన్ కోసం ఈనెల 15 వరకు నీటి విడుదల చేపట్టాలని ఆయకట్టు రైతులు డిమాండ్ చేస్తున్నారు. అప్పుడే వరి గట్టెక్కుతుందన్నారు. 15 వరకు నీటి సరఫరా జరిగితే మరో వారంరోజులు ప్రధాన పొలంలో తడి ఉంటుంది. దీంతో పంటలు 20 వరకు గట్టెక్కుతాయంటున్నారు. ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి నీటి విడుదల షెడ్యూల్‌ను 15 వరకు పొడిగించాలని కోరుతున్నారు.

కొనసాగుతున్న నీటి విడుదల..

ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 3500 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 50 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువ ద్వారా 300 క్యూసెక్కులు, అలీసాగర్ ద్వారా 510 క్యూసెక్కులు, గుత్ప లిఫ్ట్ ద్వారా 270 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 600 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 521 క్యూసెక్కుల నీరుపోతుంది. కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతుండటంతో ప్రాజెక్ట్ నీటి మట్టం వేగంగా తగ్గుతుంది.

చేపల చెరువుకోసం ఇరుగ్రామాల ఘర్షణ

- పరస్పర దాడుల్లో 20 మందికి గాయాలు



ఇరువర్గాల దాడుల్లో గాయపడిన వారు

మాచారెడ్డి : చేపల చెరువు విషయంలో వివాదం ముదిరి రెండు గ్రామాల ప్రజలు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం మంథని దేవునిపల్లికి చెందిన ముదిరాజ్‌లు, ఇసాయిపేటకు చెందిన గంగపుత్రులు చెరువు విషయంలో కొన్నేళ్లుగా గొడవ పడుతున్నారు. దాదాపు నలభై ఏళ్లుగా వివాదం కొనసాగుతూనే ఉంది.తాజాగా శుక్రవారం చెరువుపై హక్కు మాదేనంటూ దేవునిపల్లికి చెందిన ముదిరా జ్ కులస్తులు, కాదు మాదేనంటూ ఇసాయిపేటకు చెందిన గంగపుత్రులు పట్టుబట్టడంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. అనంతరం పరస్పర దాడులకు పాల్పడ్డారు. రణరంగాన్ని తలపించే రీతిలో రాళ్ల రువ్వుకోవడంతో దాదాపు 20 మందికి గాయాలయ్యాయి. కామారెడ్డి డీఎస్పీ సు రేశ్, మాచారెడ్డి ఎస్సై సంతోష్‌లు పోలీసు బలగాలతో ఘటనా స్థలికి చేరుకుని ఇరు వర్గాలను సముదాయించే ప్రయత్నం చేశారు. అయినా వినకుండా ఒకరినొకరు తిట్టుకుంటూ పోలీసుల ముందే రాళ్లు రువ్వుకున్నారు. దాదాపు మూడు గంటల పాటు సాగిన ఘర్షణను పోలీసులు అదుపు చేసి ఇరువర్గాలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. గాయపడ్డ వారిని కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.



ఆందోళన చేస్తున్న వారిని సముదాయిస్తున్న పోలీసులు

పన్ను వసూళ్లలో ‘కార్పొరేషన్’ దూకుడు

- ఫలించిన బల్దియా అధికారుల కృషి
- రాష్ట్రంలో తృతీయస్థానం
- ప్రథమ, ద్వితీయ స్థానాల్లో వరంగల్, మణికొండ
- ఆర్నెళ్లుగా సెలవులు లేకుండా విధులు



నిజామాబాద్ నాగారం : నిజామాబాద్ కార్పొరేషన్ పన్ను వసూళ్లలో అధికారుల కృషి ఫలించింది. గతంలో ఎప్పుడు లేని విధంగా రాష్ట్రంలో తృతీయ స్థానంలో నిలిచింది. రాష్ట్రంలో ఉన్న 140 మున్సిపాలిటీల్లో మొదటి స్థానంలో వరంగల్ రూ. 66 కోట్లు వసూలు చేయగా, మణికొండ రూ. 35.50 కోట్లు వసూలు చేసి రెండో స్థానంలో నిలవగా, కార్పొరేషన్ రూ. 33.50 కోట్లు ఆస్తి పన్ను వసూలు చేసింది. ఇందులో ఆర్నెళ్లుగా 6 టీంలతో 8 మంది అధికారులు, 32 మంది బిల్ కలెక్టర్లు సెలవుల్లేకుండా విధులు నిర్వహించడంతో ఈ ఘనత సాధించారు. నిజామాబాద్ కార్పొరేషన్ పరిధిలో 60 డివిజన్లు, 90 వేల కుంటుంబాలు, 3.99లక్షల జనాభా ఉంది. ఆస్తిపన్ను వసూళ్లు ప్రతి ఏడాది కత్తిమీద సామె. ఈ ఏడాది మున్సిపల్ చిత్రామిశ్రా ఆదేశాల మేరకు ప్రత్యేకంగా కార్యాచరణ రూపొందించారు. ఆర్నెళ్లగా ముందుగా ప్రణాళికతో ఆస్తిపన్ను వసూళ్లు చేసేలా శిక్షణ ఇచ్చారు. ఎలాగైనా ఈ ఏడాది కచ్చితంగా రూ. 47 కోట్ల టార్గెట్ సాధించడానికి కృషి చేశారు. ఆర్‌వో, ఆర్‌ఐలు, బిల్ కలెక్టర్లు ప్రతినిత్యం సమయ, పాలన లేకుండా నిరంతరం ఆస్తి పన్ను వసూళ్ల కోసం కష్టపడ్డారు. ఫలితంగా ఈరోజు రాష్ట్రస్థాయిలో మూడోస్థానంలో నిలిచారు.

అధికారుల కష్టానికి ఫలితం..

గత నవంబర్ నుంచి మార్చి 31 వరకు నిరంతరం శ్రమించారు. ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా కష్టపడడం వల్లే రూ. 33.50 కోట్ల ఆస్తి పన్ను వసూలైంది. మరో 10 రోజులు సడలింపు ఇవ్వడంతో ఈనెల 10 వరకు సెలవు రోజుల్లో కూడా రెవెన్యూ అధికారులు నిరంతరం కృషి చేస్తున్నారు.

మున్సిపాలిటీల్లో అంతంతే..

జిల్లాలో మొత్తం నాలుగు మున్సిపాలిటీలున్నాయి. ఇందులో నిజామాబాద్ కార్పొరేషన్ మినహాయిస్తే, బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్ మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను వసూళ్లు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఇక్కడి కమిషనర్లు, ఇన్‌చార్జి అధికారులు అలసత్వంతో ఆశించిన స్థాయిలో వసూలు కాలేదు.

- ఆర్మూర్ మున్సిపాలిటీల్లో 19 వేల ఇళ్లకు గాను రూ.5.20 కోట్ల టార్గెట్‌కు రూ. 3.70 కోట్లు వసూలయ్యాయి.
- బోధన్‌లో 19వేల ఇళ్లకు గాను రూ. 7.50 కోట్ల టార్గెట్‌కు గాను రూ. 4.50 కోట్ల ఆస్తి పన్ను వసూలైంది.
- భీమ్‌గల్ మున్సిపాలిటీలో 5వేల ఇళ్లకు గాను రూ. 1.70 కోట్ల టార్గెట్‌కు గాను రూ. కోటి మాత్రమే వసూలైంది.

ద్వితీయస్థానం కోసం..

మున్సిపల్ కమిషనర్ చిత్రామిశ్రా ఆదేశాల మేరకు ఆస్తి పన్ను వసూళ్ల కోసం శ్రమించాం. 6 టీంలతో అధికారుల, బిల్ కలెక్టర్లు నిరంతరాయంగా శ్రమించడం వల్లే తృతీయస్థానంలో నిలిచాం. ద్వితీయస్థానంలోకి వచ్చేందుకు కృషి చేస్తున్నాం. కార్పొరేషన్ పరిధిలో ఆస్తి పన్ను వసూళ్లు చేయడానికి ప్రత్యేకంగా కార్యచరణతో ముందుకు వెళ్లడం వల్లే సాధ్యమైంది.

– నరేందర్, ఇన్‌చార్జి రెవెన్యూ ఆఫీసర్

క్లుప్తంగా

వామ్మో.. బైక్‌పై ఐదుగురి ప్రయాణం



మద్నూర్(జుక్కల్): నిర్లక్ష్యం కారణంగా నిత్యం ఏదో ఒక చోట రోడ్డు ప్రమాదాలు జరుగుతునే ఉన్నాయి. బైక్‌పై ఇద్దరికంటే మించి ప్రయాణిస్తు పలువురు ప్రమాదాల బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నారు. అయినా ప్రజలు మాత్రం మారడం లేదు. మద్నూర్ సమీపంలో ఒక కుటుంబ శుక్రవారం బైక్‌పై ఇలా ప్రమాదకరంగా చిన్నా, పెద్ద అంత కలిసి ఐదుగురు వెళ్తున్న దృశ్యాన్ని 'సాక్షి' క్లిక్ మనిపించింది.

అకాల వర్షం.. ఆందోళనలో రైతన్న

వర్ని: మండలంలోని సత్యనారాయణపురం జాకోర, కోటయ్య క్యాంపు, పాత వర్ని గ్రామాల్లో శుక్రవారం ఉదయం వర్షం పడటంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. మండలంలో సుమారు గంటపాటు వర్షం పడింది. రబీ పంటలు చేతికి వచ్చి కోతలు కోస్తున్న సమయంలో వర్షం పడటంతో పండిన పంట తడిసిపోయి ఎక్కడ నష్టానికి గురవుతామోనని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. పంటలు కోసి కాంటాలు పెడుతుండగా, వర్షం పడటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో వైద్యం, విద్యకు ప్రాధాన్యత



డిచ్‌పల్లి: సీఎం కేసీఆర్ రాష్ట్రంలో వైద్యం, విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని టీఎస్ ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పేర్కొన్నారు. నగరంలోని తన నివాసంలో శుక్రవారం పలు బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాజిరెడ్డి గోవర్ధన్ అందజేశారు. కార్యక్రమంలో ఐడీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, ధర్పల్లి జెడ్పీటీసీ జగన్, ఎంపీపీ రమేష్‌నాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చింత శ్రీనివాస్‌రెడ్డి, చిలివేరి దాస్, సీనియర్ నాయకులు దాసరి లక్ష్మీనర్సయ్య, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు సాయిలు, సర్పంచుల ఫోరం అధ్యక్షులు మోహన్‌రెడ్డి, అశోక్, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంకన్‌డ్రైవ్‌లో ఇద్దరిపై కేసు



భిక్కనూరు: మండలకేంద్రంలోని పాత జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి భిక్కనూరు ఎస్సై గాంధీగౌడ్ వాహనదారులకు డ్రంకన్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. దీంతె మద్యం తాగి వాహనాలను నడుపుతున్న ఇద్దరిని పట్టుకుని వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అలాగే వారి బైక్‌లను పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ



బాల్కొండ: మండలంలోని బోదేపల్లి గ్రామ శివారులోగల పొలాల్లో గురువారం అర్ధరాత్రి రెండు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులో నుంచి కాపర్‌తీగ, అయిల్‌ను గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. దీంతో ట్రాన్స్‌కో అధికారులు శుక్రవారం బాల్కొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గత ఐదు రోజుల్లో రెండు చోరీలు జరుగగా.. 9 ట్రాన్స్‌ఫార్మర్లను దుండగులు ధ్వంసం చేశారు.

అటకెక్కిన పశువైద్య సేవలు

- ఉమ్మడి బీర్కూర్ మండలంలో తెరుచుకోని సబ్ సెంటర్లు
- 8సబ్ సెంటర్‌లకు ఇద్దరే వైద్యులు
- పశుగోస పట్టని అధికారులు



నాచుపల్లిలో శిథిలావస్థకు చేరుకున్న పశువైద్యశాల

నస్రుల్లాబాద్(బాన్సువాడ): జిల్లాలో పశువైద్య సేవలు సక్రమంగా అందడం లేదు. జిల్లాలోని పశు వైద్యశాలల్లో సిబ్బంది కొరత, శిథిలావస్థ భవనాల వల్ల పశువులకు సకాలంలో వైద్య సేవలు లభించడం లేదు. దీంతో గొర్రెలు, మేకలు, పశు పెంపకందారులు వైద్యసాయం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గొర్రెలు, మేకల పెంపకం చేపట్టి మాంసం ఉత్పత్తులు పెంచాలని ప్రభుత్వం వాటిని సరఫరా చేస్తున్నా.. వాటి ఆరోగ్యాన్ని కాపాడాల్సిన వైద్యులు లేకపోవడంతో లబ్ధిదారులు వాటికి మాంసం విక్రయదారులకు విక్రయిస్తున్నారు. ఈక్రమంలో పాడి, పశు సంపద పెంచాలన్న ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది.

జిల్లాలో 37పోస్టులు ఖాళీ..

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా గేదెలు, గొర్రెలు, మేకలు, ఆవులు సుమారు 11లక్షల పైగానే ఉన్నాయి. వీటి సంరక్షణకు 132 మంది వైద్యులు అందులోబాటులో ఉండాలి. కానీ వివిధ పోస్టుల్లో 95మంది ఉండగా.. 37 పోస్టులు కాలీగా ఉన్నాయి. అలాగే ఉమ్మడి బీర్కూర్ మండలంలో 27 గ్రామ పంచాయతీలకు 8 పశువైద్య సబ్ సెంటర్లు ఉన్నాయి. కానీ వీటి పరిధిలో నస్రుల్లాబాద్ మండలం దుర్కి,బీర్కూర్ మండల కేంద్రానికి మినహా అన్ని సెంటర్లలో ఖాళీలు వెక్కిరిస్తున్నాయి.

శిథిలావస్థలో పశు వైద్యశాలలు..

నస్రుల్లాబాద్ మండల పరిధిలో నస్రుల్లాబాద్, దుర్కి, బొమ్మన్‌దేవ్‌పల్లి, నాచుపల్లి, మిర్జాపూర్‌లో పశువైద్య సబ్ సెంటర్లు ఉన్నాయి. వీటిలో దుర్కికి వైద్య సిబ్బంది ఉండగా, నస్రుల్లాబాద్, మిర్జాపూర్ లలో అటెండర్‌లు విధులు నిర్వర్తిస్తున్నారు. నాచుపల్లి, బొమ్మన్‌దేవ్‌పల్లి సెంటర్లను అధికారులు పట్టించుకోకపోవడంతో భవనాలు శిథిలావస్థకు చేరుకొని, కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. ఆయా సెంటర్లలో ఉన్న మందులు సైతం సంవత్సరాల తరబడి ఉండటంతో పనికి రాకుండా అయ్యాయని పాడిరైతులు వాపోతున్నారు. బీర్కూర్ మండలం తిమ్మాపూర్‌లో పూర్తి స్థాయి సిబ్బంది లేకపోవడంతో ఓ మహిళా పశువులకు మందులు అందిస్తూ, ప్రథమ చికిత్సలు చేస్తూ రైతులకు అందుబాటులో ఉంటూ ప్రైవేటుగా ఉపాధి పొందుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, పశువైద్యుల పోస్టులను భర్తీ చేయాలని, వైద్య సేవలు సక్రమంగా అందించాలని పాడి రైతులు, పశుపెంపకం దారులు కోరుతున్నారు.

పాడిగేదెలను అమ్ముకుంటున్నాం



ఉపాధి కోసం గతంలో పాడి గేదెలను నమ్ముకునే వాళ్లాం. కానీ సమయానికి వైద్యం అందకపోవడంతో దూర ప్రాంతాల నుంచి వైద్యులు వచ్చేలోపు గేదె పరిస్థతి విషమంగా మారుతుండేది. దీంతో పశువులను అమ్ముకునే పరిస్థితి నెలకొంది. మిర్జాపూర్‌లో మహిళా అటెండర్‌తో కాలం వెళ్లదీస్తున్నారు.

–రాములు, పాడి రైతు, మిర్జాపూర్

వైద్యులను నియమించాలి



నాచుపల్లి పశువైద్యశాలలో వైద్యులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. పశువులకు వైద్యం అందించడానికి నస్రుల్లాబాద్ వెళ్లాల్సివస్తోంది. లేదంటే ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయించాల్సి వస్తుంది. అధికారులు స్పందించి పశువైద్యుడిని నియమించాలి.

–సున్నం సాయిలు, పాడిరైతు, కామిశెట్టిపల్లి

పిట్లంలో యాంకర్ శ్రీముఖి సందడి



ఫ్యాన్స్‌తో సెల్ఫీ దిగుతున్న యాంకర్ శ్రీముఖి

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలో శుక్రవారం బిగ్ బాస్ ఫేమ్, యాంకర్ శ్రీముఖి సందడి చేశారు. మల్టీబ్రాండ్ మొబైల్ రిటైల్ చైన్ 'సెల్ బే' తెలంగాణలో 57వ స్టోర్‌ను పిట్లంలో ఏర్పాటు చేయగా.. షోరూంను శుక్రవారం శ్రీముఖి ప్రారంభించారు. శ్రీముఖిని చూసేందుకు భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. వారిని శ్రీముఖి హాయ్.. ఎలా ఉన్నారంటూ పలకరించి ఫ్యాన్స్‌తో సెల్ఫీ దిగి అందరిని ఉత్సాహపర్చింది. శ్రీముఖితో సెల్ఫీలు దిగేందుకు జనాలు ఎగబడ్డారు. శ్రీముఖి మాట్లాడుతూ.. సెల్‌ఫోన్ వినియోగం అనేది నిత్యజీవితంలో భాగమైందన్నారు. సెల్ బే సంస్థ ఎండీ సోమ నాగరాజు మాట్లాడుతూ.. తెలంగాణలో 55కి పైగా స్టోర్‌లు కలిగిన తమ సంస్థ టైర్ 3, టైర్ 2 పట్టణాల్లో మరిన్ని షోరూంలను ప్రారంభించనున్నామని పేర్కొన్నారు. సెల్‌బే డైరెక్టర్ సుహాస్ నల్లచెరు మాట్లాడుతూ.. ఈ లాంచింగ్ సందర్భంగా వినియోగదారులకు ప్రతి మొబైల్ కొనుగోలుపై ఖచ్చితమైన బహుమతులు, ఆఫర్లతో పాటు 0 శాతం ఫైనాన్స్ ఆప్షన్‌లు పొందవచ్చు అన్నారు. సెల్ బే వైస్ ప్రెసిడెంట్ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. సెల్‌బే స్టోర్‌లో అన్ని బ్రాండ్‌ల మొబైల్స్‌తో పాటు, ల్యాప్ టాప్‌లు, స్మార్ట్ టీవీలు, స్మార్ట్ వాచ్, స్మార్ట్ వాటర్ ప్యూరిఫైయర్స్, పర్సనల్ కేర్, అన్ని రకాల ఆక్సిసిరీస్ లభిస్తాయి అని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సెల్ బే షోరూంను ప్రారంభిస్తున్న శ్రీముఖి

కేసీఆర్‌ను ఎదుర్కోలేకే ప్రశ్నాపత్రాల లీకేజీలు

- స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి
- సిద్ధాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం





ఆత్మీయ సమ్మేళనంలో కార్యకర్తలతో కలిసి భోజనం చేస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి.. బతుకమ్మ ఆడుతున్న మహిళా ప్రజాప్రతినిధులు

రుద్రూర్: సీఎం కేసీఆర్‌ను ఎదుర్కొనే శక్తి లేక, రాష్ట్ర ప్రభుత్వానికి చెడ్డపేరు తేవడానికి కొందరు పరీక్ష ప్రశ్నాపత్రాలను లీక్ చేస్తున్నారని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రుద్రూర్ మండలం సిద్ధాపూర్ శివారులో శుక్రవారం బీఆర్ఎస్ మండల కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. పార్టీ సభ్యులను ఆత్మీయంగా కలుసుకునేందుకు సతీసమేతంగా వచ్చానని కార్యకర్తలకు వివరిస్తూనే.. టెన్త్ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారంలో బీజేపీ నాయకుల హస్తం ఉందని విరుచుకుపడ్డారు. సమ్మేళనానికి స్పీకర్ పోచారం శ్రీనివాస్, పార్టీ కార్యకర్తలు సతీసమేతంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ, మహిళ సర్పంచ్‌లు బతుకమ్మ, దాండియా ఆడి ఉత్సాహాన్ని కల్గించారు. అలాగే రుద్రూర్ మండల కేంద్రంలో రూ.20లక్షల వ్యయంతో నిర్మించనున్న శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి, రూ. 15లక్షలతో చేపట్టబోయే ముదిరాజ్ సంఘం ప్రహరీ, కిచెన్‌షెడ్డుకు స్పీకర్ భూమి పూజ చేశారు.

రసవత్తరంగా కుస్తీపోటీలు





లింగంపల్లి(ఖుర్దు)లో కుస్తీ పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు.. పెగడపల్లి గ్రామంలో..

సాక్షి నెట్‌వర్క్: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో నిర్వహించిన కుస్తీపోటీలు రసవత్తరంగా కొనసాగాయి. ఈ పోటీల్లో తెలంగాణకు చెందిన మల్లయోధులతో పాటు మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలకు చెందిన మల్లయోధులు పాల్గొని, తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. హోరాహోరీగా సాగిన పోటీల్లో విజయం సాధించిన మల్లయోధులకు వెండి కడెం, నగదు బహుమతులను నిర్వాహకులు అందజేశారు. మద్నూర్ మండలంలోని సలాబత్‌పూర్‌లో జాతర సందర్భంగా హనుమాన్ ఆలయ ఆవరణలో రథోత్సవం, భాగవతాలు నిర్వహించారు. అలాగే కుస్తీ పోటీలు నిర్వహించారు. పోటీలను తిలకించడానికి మద్నూర్ మండలంతో పాటు చుట్టు పక్కల మండలాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పిట్లం మండలంలో రూ.10నుంచి రూ. 5వేల వరకు కుస్తీ పోటీలను నిర్వహించారు. పోటీలను తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భారీగా హాజరయ్యారు. అలాగు బోధన్ మండలంలోని పెగడపల్లి గ్రామంలో ఎల్లమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా కుస్తీ పోటీలు నిర్వహించారు.



మోస్రా మండల కేంద్రంలో..



గౌరారంలో కుస్తీ పోటీలో తలపడుతున్న మల్లయోధులు

క్రైం కార్నర్

వేర్వేరు ఘటనల్లో ఐదుగురి మృతి

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో చోటుచేసుకున్న వేర్వేరు ఘటనల్లో ఐదుగురు మృతిచెందారు. బైక్‌ను బస్సు ఢీకొన్న ఘటనలో బాలిక మృతిచెందింది. అలాగే బైక్‌పై వస్తున్న యువకుడు చెట్టును ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. వరద కాలువలో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు పడి మృతిచెందాడు. చేపలవేటకు వెళ్లిన ఓ వ్యక్తి నీటికుంటలో పడి మృతిచెందాడు. సోమార్‌పేట్‌లో అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

బస్సు ఢీకొని బాలిక..

బోధన్ రూరల్ (బోధన్): సాలురా మండల కేంద్రంలోని అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ సమీపంలో మహారాష్ట్ర బస్సు ఢీకొని ఓ బాలిక మృతిచెందింది. బోధన్ రూరల్ ఎస్సై సందీప్ తెలిపిన వివరాలు ఇలా.. బోధన్ మండలంలోని కొప్పర్గా గ్రామానికి చెందిన షేక్ అబ్బాస్ తన కూతురు సాఫియా(12)తో శుక్రవారం బైక్‌పై మహారాష్ట్రలోని బంధువుల ఇంటికి బయలుదేరాడు. సాలూర చెక్‌పోస్ట్ సమీపంలో వీరి బైక్‌ను వెనుక నుంచి వస్తున్న మహారాష్ట్ర బస్సు ఢీకొట్టింది. ఈఘటనలో సాఫియా అక్కడికక్కడే మృతిచెందగా.. తండ్రికి స్వల్ప గాయాలయ్యాయి. మృతురాలి తండ్రి ఫిర్యాదు మీదకు కేసు నమోదు చేసి దర్యాప్తుత్ చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వరద కాలువలో పడి ఒకరు..

మోర్తాడ్(బాల్కొండ): మోర్తాడ్ శివారులోని వరద కాలువలో ప్రమాదవశాత్తు పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. వరద కాలువలో శుక్రవారం పైకి తేలిన మృతదేహంను స్థానికులు గుర్తించారు. గ్రామ పంచాయతీ సిబ్బంది మృతదేహంను బయటకు తీసి, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడు ఆర్మూర్‌లోని జెమ్మన్‌జెట్టి గల్లికి చెందిన సందల శ్రీనివాస్(40)గా గుర్తించారు. ప్రాథమిక విచారణలో శ్రీనివాస్ ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతిచెందినట్లు తేలిందని ఎస్సై ముత్యంరాజు తెలిపారు. కేసు నమోదు చేసుకుని మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ఆస్పత్రికి తరలించారు.

చెట్టును ఢీకొని యువకుడు..

ఎల్లారెడ్డి: మండలంలోని మీసాన్‌పల్లి గ్రామ శివారులో చెట్టుకు బైక్ ఢీకొనడంతో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై గణేష్ శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా.. నిజాంసాగర్ మండలం వడ్డేపల్లి నల్లగుట్ట తండాకు చెందిన యువకుడు ధరావత్ సరిచంద్(28) గురువారం తన అక్క శాంతిబాయిని బైక్‌పై ఎక్కించుకుని నాగిరెడ్డిపేట మండలంలోని బొల్లారంలో గల బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరిగి సొంతూరుకు వెళ్తున్న క్రమంలో గురువారం రాత్రి మీసాన్‌పల్లి శివారులో సరిచంద్ బైక్ చెట్టును ఢీకొంది. ఈఘటనలో సరిచంద్ అక్కడికక్కడే మృతి చెందాడు. శాంతిబాయి చేతికి తీవ్ర గాయాలు కావడంతో ఆమెను జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య పారుబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో..

ఎల్లారెడ్డి: మండలంలోని సోమార్‌పేట్ గ్రామంలో ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో శుక్రవారం మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన మాదిగ సాయిలు(35)కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సాయిలు తరుచు మద్యం తాగడంతో తన భార్యతో గొడవలు జరుగుతుండేవి. ఈక్రమంలో శుక్రవారం ఉదయం లేచి చూసేసరికి సాయిలు మృతి చెందడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి ఒకరు..



మృతదేహాన్ని బయటకు తీస్తున్న జాలర్లు

బాన్సువాడరూరల్: మండలంలోని సోమేశ్వర్ గ్రామంలో చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు నీటి గుంటలో పడి మృతిచెందాడు. బాన్సువాడ సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన ఒడ్డెర ర్యాపని మారుతి(26) ఈనెల 5న కొల్లూర్ గ్రామం నుంచి కిరాణా సామను తీసుకుని వస్తానని ఇంటినుంచి వెళ్లి, తిరిగి రాలేదు. దీంతో మరుసటి రోజు మారుతి భార్య తన భర్త సైకిల్ కొల్లూర్‌లోని బర్లలక్ష్మి కిరాణాషాపు వద్ద ఉండటంతో వారిని వివరాలు అడిగింది. చేపలు పట్టడానికి వెళ్తున్నానని చెప్పి మారుతి తన సైకిల్, సెల్‌ఫోన్‌ను ఇక్కడ ఉంచి వెళ్ళినట్లు కిరాణాషాపు యజమాని తెలిపింది. దీంతో గ్రామంలోని చెరువులు, కుంటల్లో వెతుకగా శుక్రవారం మారుతి మృతదేహం లభించింది. తన భర్త చేపలు, ఎండ్రికాయల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిగుంటలో పడి, ఈతరాకపోవడంతో మృతి చెందాడని భార్య లక్ష్మి ఫిర్యాదులో పేర్కొంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు బాన్సువాడ పోలీసులు తెలిపారు. మృతుడికి 3సంవత్సరాలల బాబు ఉండగా..అతని భార్య లక్ష్మి ప్రస్తుతం గర్భిణి.

మొక్కజొన్న చొప్ప తిని రెండు ఆవులు మృతి

- 15ఆవుల పరిస్థితి విషమం



ఆవుకు చికిత్స నిర్వహిస్తున్న పశువైద్య సిబ్బంది

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని నల్లమడుగు పెద్ద తండాలో శుక్రవారం సాయంత్రం మొక్కజొన్న చొప్ప తిని రెండు ఆవులు మృతి చెందగా.. 15 ఆవుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు తండావాసులు తెలిపారు. తండాకు చెందిర రావుజాకు 100కు పైగా ఆవులు ఉన్నాయి. ఆవులకు రోజువారి మేత కోసం వాటిని గ్రామ శివారులోకి తీసుకెళ్లారు. ఈక్రమంలో ఆవులు మొక్కజొన్న చొప్ప తిని చెరువులో నీళ్ల తాగడంతో అక్కడికక్కడే రెండు ఆవులు మృతి చెందాయి. మరో 15ఆవుల పరిస్థితి విషమంగా మారింది. బాధితుడు పశువైద్యాధికారి, గోపాల మిత్రలకు సమాచారం ఇవ్వడంతో వైద్య సిబ్బంది ఆవులకు చికిత్స నిర్వహిస్తున్నారు. మొక్కజొన్న పంటకు మందులు పిచికారి చేయడంతో అది తినడం వల్లే ప్రమాదం జరిగిందని వైద్యులు పేర్కొన్నారు.

టేకు దుంగల స్వాధీనం



అటవీ అధికారులు పట్టుకున్న టేకు దుంగలు

సిరికొండ: సిరికొండ అటవీ రేంజ్ పరిధిలోని తాటిపల్లి గ్రామ శివారులో గురువారం అర్ధరాత్రి టేకు దుంగలను పట్టుకున్నట్లు రేంజ్ అధికారి ఎంవి నాయక్ శుక్రవారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు గ్రామ సమీపంలో గాలించగా అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 25టేకు దుంగలు లభ్యమైనట్లు తెలిపారు. వాటిని సిరికొండలోని రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు ఎఫ్ఆర్‌వో తెలిపారు. సిరికొండ సెక్షన్ అధికారి గంగారం, సిబ్బంది పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం





ప్రమాదంలో కాలిపోయిన వస్తువులు, ఆభరణాలు

భిక్కనూరు: మండల కేంద్రంలో షార్ట్ సర్క్యూట్‌తో శుక్రవారం ఒక ఇల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన తొత్తాల మల్లేశం గొర్రెల కాపరిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం గొర్లను కాయడానికి మెయటకు వెళ్లాడు. ఆయన కుటుంబీకులు ఇంటికి తాళం వేసి పనులకు వెళ్లారు. ఈక్రమంలో ఇంట్లో నుంచి మంటలు రావడంతో స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ మంటలు అదుపులోకి రాలేదు. దీంతో ఫైర్ సిబ్బందికి సమాచారం అందింగా, మంటలను ఆర్పివేసింది. ప్రమాదంలో ఇంట్లో దాచుకున్న రూ.42 వేల నగదు, 50 తులాల వెండి వస్తువులు, నాలుగు తులాల బంగారం ఆభరణాలు, వంట సామగ్రి, దుస్తులు కాలిపోయాయి.

కారు బోల్తా.. ప్రయాణికులు సురక్షితం



నిజాంసాగర్(జుక్కల్): బాన్సువాడ–ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై శుక్రవారం ఉదయం మండలంలోని గాలీపూర్ శివారులో మూలమలుపు వద్ద ఓ కారు అదుపుతప్పి బోల్తాపడింది. మూలమలుపు వద్ద ప్రమాద సూచిక బోర్డు లేకపోవడంతో వేగంగా వెళ్తున్న కారు ప్రమాదవశాత్తు గుంతలోకి పల్టీలు కొడుతూ బోల్తాపడింది. ప్రమాదంలో కారులోని దంపతులతోపాటు ఐదు సంవత్సరాల బాలుడు సురక్షితంగా బయటపడ్డారు.

నగరానికి కల్లు తరలింపు

–అడ్డుకున్న ముగ్గురిపై దాడి

ఖలీల్‌వాడి: నిజామాబాద్ రూరల్ మండలంలోని పాంగ్రా నుంచి నిజామాబాద్‌కు కల్లు తరలిస్తున్న వారిని అడ్డుకున్న వారిపై నగర శివారులోని బోర్గాం(పి) వద్ద శుక్రవారం దాడి చేశారు. నగరానికి ప్రతిరోజు 150 లీటర్ల వరకు పాంగ్రా నుంచి కల్లు తరలించడంపై ముగ్గురు వ్యక్తులు అభ్యంతరం తెలిపారు. దీంతో మల్లేష్‌తోపాటు 20 మంది వరకు కలిసి రవి, శ్రీనివాస్, గంగాధర్‌పై దాడి చేశారు. దాడిలో రవి కాలు విరిగిపోగా, శ్రీనివాస్, గంగాధర్ తల, చేతులకు గాయాలైయ్యాయి. దీంతో బాధితులు నాలుగో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కొడుకు మృతిని తట్టుకోలేక తండ్రి ఆత్మహత్య

భిక్కనూరు: మండలంలోని బస్వాపూర్ గ్రామంలో ఇటీవల తన కుమారుడు మరణించగా మనస్తాపం చెందిన తండ్రి గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన మద్ది బాల్‌రాజు (73) అనే వృద్ధుడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు నరేశ్ ఆరు నెలల క్రితం ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. అప్పటి నుంచి కొడుకు లేనిలోటును గుర్తు చేసుకుంటూ మానసికంగా కుంగిపోయాడు. తానూ కొడుకు దగ్గరకు వెళతానంటూ తరచూ చెబుతుండేవాడు. ఈక్రమంలో గురువారం రాత్రి తన గదిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.